www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం జులై 28 2024



ట్రిపుల్ ఐటీకి లక్ష్మీసుధా ఎంపిక



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరు గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీ సుధా శ్రీకాకుళంలో గల ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హైస్కూల్లో చదువుతున్న లక్ష్మీసుధా తన తోటి విద్యార్థులు కంటే ఎంతో చురుకుగా చదువుకునేదని, తన ప్రజ్ఞాపాఠవాలతో ఈఅవకాశం లభించిందని హైస్కూల్ హెచ్‌ఎం, టీచర్లు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రశ్నించే గొంతును నొక్కేస్తాయ్..!

- 'భారతీయ న్యాయ సంహిత' చట్టాలు శాపమే
- సదస్సులో న్యాయనిపుణులు, కార్మికనేతల ఉద్ఘాటన



ప్రజాశక్తి - తిరుపతి సిటి

'భారతీయ న్యాయ సంహిత' చట్టాలు కార్పొరేట్‌కు చుట్టాలుగా మారి ప్రశ్నించే గొంతును నొక్కేస్తాయని సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. న్యాయస్థానాలకు హక్కులను తగ్గించి, పోలీసులకు అధికారాలు కట్టబెడుతూ కొత్త చట్టాలను బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిందన్నారు. సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'భారతీయ న్యాయ సంహిత చట్టాలు వరమా..? శాపమా?' అనే అంశంపై వేమన విజ్ఞాన కేంద్రంలో సదస్సు జరిగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షత వహించారు. ప్రముఖ న్యాయవాది, ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ ప్రధాన ఉపన్యాసకులుగా హాజరై మాట్లాడుతూ ప్రశ్నించేవారి గొంతు నొక్కేలా, పోరాటాలను అణచివేసేలా కొత్త చట్టాలు ఉన్నాయన్నారు. సుంకర రాజేంద్రప్రసాద్ ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసిడ్యూర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల పేర్లు స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదీనియంలను తీసుకొచ్చారని, వాటిని జూలై 1 నుంచి అమలు చేస్తున్నారన్నారు. వీటికి పేర్లు, సెక్షన్లు మార్చారే తప్ప ప్రజలకు సత్వర న్యాయాన్ని అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏ మాత్రం తీసుకోలేదని దుయ్యబట్టారు. ఐపిసి 111 సెక్షన్ స్థానంలో కంటిన్యూ అన్లాఫుల్ యాక్టు తెచ్చారని, ఈ ప్రకారం కార్మికులకు అండగా పోరాడే వారిపై ఈ సెక్షన్ పెట్టేలా ఉందన్నారు. గతంలో ఇలాంటి కేసులు నమోదు చేయాలంటే అడిషినల్ డిజి స్థాయికి మాత్రమే అధికారం ఉండేదని, కొత్త చట్టం వల్ల సిఐ స్థాయిలోనూ అరెస్టు చేయొచ్చని, ముందస్తు సమాచారం ఇవ్వనందుకు కుటుంబ సభ్యులపైనా కేసు పెట్టొచ్చన్నారు. సమస్యలపై పోరాడేవారే కాకుండా, వారి కుటుంబ సభ్యులను జైలుకు పంపేలా చట్టాలు ఉన్నాయన్నారు. రైతు చట్టాలను సైతం పోరాటాల ద్వారా రద్దు చేశారన్నారు. మొన్నటికి మొన్న భూల్యాండ్ టైటిల్ యాక్టును ఐలు పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో రద్దు చేశారని గుర్తు చేశారు. అర్థంపర్థం లేకుండా కార్పొరేట్లకు కొమ్ముగాసే కొత్త చట్టాలను అమల్లోకి తెచ్చిన జూన్1 నిజమైన రాజ్యాంగ హత్య దినోత్సవం అని ఎద్దేవా చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా : గుర్రప్ప, రిటైర్డ్ జడ్జి

సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా కేంద్రం కొత్త చట్టాలు చేసింది. ఇప్పటికీ పలుకుబడి ఉంటే తప్ప పోలీసు స్టేషన్‌లో బాధితుల పక్షాన కేసు పెట్టరు. ఇక పోలీసులకు పెత్తనం ఇస్తే ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

పోరాడితేనే తిప్పిగొట్టగలం
సిహెచ్ నర్సింగరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అభివృద్ధి చెందుతున్న యూరప్ దేశాల్లో మోటారు కార్మికులకు ప్రతి రెండు గంటలకు ఒకసారి అర్ధగంట విరామం ఇచ్చేలా చట్టాలు ఉన్నామి, ఈ దేశంలో విశ్రాంతి అనేదే లేదు. శిక్షలు పెంచితే ప్రమాదాలు తగ్గుతాయనడం అవివేకం. జరిమానాలు కట్టలేక యాజమానులు వాహనాలనే వదిలేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కోట్లు ఎగొట్టిన వారికి వత్తాసు పలుకుతూ కడుపుకూటి కోసం శ్రమించే వారికి కఠిన శిక్షలు వేస్తుంది. మోడి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు 11 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసింది. కార్మికులు, సామాన్యులు చైతన్యవంతులై పోరాడితే తప్ప రాజ్యాంగాన్ని కాపాడుకోలేం.

పోరాటాలను అణచివేసేందుకే : కుమార్, ఐలు రాష్ట్ర అధ్యక్షులు

రాజ్యాంగబద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా చట్టాలు తేవడం శోచనీయం. వలసవాద చట్టాలను రద్దు చేస్తామన్న పాలకులు పోలీసుయాక్టు 30ని ఎందుకు రద్దు చేయలేదు. గతంలో ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయని పాలకులు తమ పేరు కోసం కొత్త చట్టాలను తెచ్చారు.

సుదీర్ఘ చర్చ అవసరం : హేమచంద్రారెడ్డి, ఐలు జిల్లా అధ్యక్షులు

సందర్భాన్ని బట్టి చట్టాల సవరణ జరగాలి. కాని చట్టసవరణకు సుదీర్ఘ చర్చ జరగాలి. మెజార్టీ నిర్ణయం మేరకే సవరణ జరగాలి. ఇదేమి లేకుండా కనీసం నిమిషం సమయం కూడా చర్చ జరపకుండా ఏకంగా కొత్త చట్టాలు తీసుకురావడం దారుణం. ప్రజల కోసం సవరణలు ఉండాలే కానీ, పెత్తందారుల కోసం చట్టాలు చేయకూడదు.

చెడును వ్యతిరేకించాలి
అంబూరి సింధూజ, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పాలకులు ఎవ్వరైనా చెడును వ్యతిరేకించాలి. ప్రజలకు అన్యాయం చేసే చట్టాలపై దేశ వ్యాప్తంగా చర్చ జరగాలి. దీన్నిపై ప్రజల్లో చైతన్యం నింపి, పోరాటాలు చేపట్టాలి.

చట్టాలు కార్పొరేట్ శక్తులకు చుట్టాలు
ఎల్.రత్నకుమార్, రాష్ట్రఉపాధ్యక్షులు, ఐఎన్‌టియుసి

చట్టాలు కార్పొరేట్ శక్తులకు చుట్టాలుగా మారాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్న వారు కోటీశ్వర్లకు కొమ్ముకాస్తున్నారు ఇది సరైనది కాదు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మాటల్లో మాత్రమే భారత్ అనే పదం ఉంటుంది. చేతల్లో అందుకు భిన్నంగా ఉంటుంది. పాలనను పోలీసుల చేతుల్లో పెట్టడం దారుణం.


రాజకీయ జోక్యం తగదు
రాధాకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటియుసి

దేశానికి, ప్రజలకు అవసరమయ్యే చట్టాల రూపకల్పనలో రాజకీయ జోక్యం తగదు. హోంమంత్రి అమిత్‌షా కనుసన్నల్లోనే కొత్త చట్టాలు రూపకల్పన జరిగింది. ప్రజలను దోచుకుని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసే వారికి అనుకూలాగా చట్టలు ఉన్నాయి. అందరు ఐకత్యతో పోరాడితేనే ఇలాంటి వాటికి ఫుల్‌స్టాప్ పెట్టొచ్చు.

'డాయ్ యాప్' ఘటనపై విచారణ కమిటీ: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పలమనేరు ప్రాంతంలో 'డాయ్ యాప్' పేరుతో ప్రజలను మోసం చేసిన బాధితులకు న్యాయం చేసేందుకు మెప్మా పిడి ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ తరపున డిప్యూటీ తహసీల్దార్, పోలీస్ శాఖ తరపున పలమనేరు సిఐతో కలిపి విచారణ కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ విచారణ కమిటీ ఈ నెల 29,30వ తేదీలలో అనగా సోమ, మంగళ వారాలలో పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి కార్యాలయపు పనివేళల్లో అందుబాటులో ఉంటారని, డాయ్ యాప్ భాదితులు విచారణ కమిటీకి తమ ఫిర్యాదులను అందజేయవచ్చునని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఎమ్మెల్యేకు జరిగిన మోసాన్ని వివరిస్తున్న బాధితులు

ఎమ్మెల్యేను ఆశ్రయించిన బాధితులు

విచారణ జరపాలని మెప్మా పీడీకి ఆదేశం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలోని డాయ్ యాప్ బాధితులు శనివారం ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డిని స్థానిక కార్యాలయంలో కలిసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా తమకు జరిగిన మోసాన్ని ఆయనకు వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. మెప్మా కార్యాలయంలోని డేటాఎంట్రీ ఆపరేటర్ రాజేష్ ఆధ్వర్యంలో ఆర్పీల ద్వారా ఈ తతంగమంతా నడిచిందని పేర్కొన్నారు. గత రెండు రోజులుగా తమకు జరిగిన అన్యాయంపై ఆర్పీలను అడుగుతున్నా తమపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారని, దీనిపై ఇప్పటికే పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని దీనిపై న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మెప్మా పీడీకి ఫోన్ చేసి వెంటనే ఈఅంశంపై ప్రతిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం ఎలా చేయాలో చూడాలని ఆదేశించారు. పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు పలమనేరులో ఇలాంటి మోసాలు జరిగాయని ఇకనైనా మోసగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని బాధితులకు ఆయన హితవు పలికారు.



పోలీసు స్టేషన్‌లో బాధితులతో సిఐటియు నేతలు

మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా

పలమనేరు పురపాలక సంఘపరిధిలో మెప్మా ఉద్యోగిగా పనిచేస్తున్న రాజేష్ యాప్ స్కాంలో ప్రధాన నిందితుడిగా బాధితులు తెలియజేస్తున్న రాజేష్‌ను వెంటనే అరెస్టు చేసి విచారణ జరపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా డిమాండ్ చేశారు. శనివారం పలమనేరు పోలీసు స్టేషన్ వద్ద వచ్చిన బాధితులతో ఆయన మాట్లాడుతూ యాప్ ద్వారా నమ్మించి మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. మోసపోయిన బాధితులందరూ కార్మికులు, కర్షకులు, కూలి పనులు చేసుకునే వారని వారు కష్టపడి సంపాదించిన సొమ్ము మొత్తం ఇలా దోచుకోవడం భావ్యం కాదన్నారు. బాధితుల్లో డ్వాక్రా మహిళా సంఘంలో ఉన్నమహిళలు ఎక్కువగా ఉన్నారని, మరికొందరు యాప్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టి మోసపోయినారని తెలిపారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు




ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరు, నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర పనులను కమిషనర్ డాక్టర్ జె.అరుణ తనిఖీ చేశారు. శనివారం ఉదయం కమిషనర్ నగరంలోని కట్టమంచి, లాయర్స్ కాలనీ, తిరుపతి రోడ్డు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పారిశుద్ధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తొలగించాలని, ఇంటింటి చెత్త సేకరణ, ప్రధాన రహదారుల శుభ్రతా పనులను తనిఖీ చేశారు. రోడ్డు, కాలువల పక్కన పిచ్చిమొక్కలు తొలగించాలని ఆదేశించారు. కాలువలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాలు శుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత యజమానులకు నోటీసులు ఇవ్వాలని, వేకెంట్ ల్యాండ్ టాక్స్, ఆస్తి పన్నుల వసూలుకు చర్యలు చేపట్టాలన్నారు. నీటి సరఫరా జరుగుతున్న తీరుపై స్థానికులతో ఆరా తీశారు. విధి దీపాలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలకు నెంబర్లు వేశారా లేదో పరిశీలించారు. పాడైన విద్యుత్ దీపాలను సత్వరం మార్చాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్‌ఎస్)కు అందిన ఫిర్యాదులను పరిష్కరించిన తీరును తనిఖీ చేశారు. పీజీఆర్‌ఎస్, ప్రజల నుంచి అందే ఇతర ఫిర్యాదులను అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డుకార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రగ్స్ భవిష్యత్తును నాశనం చేస్తాయి..

అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు స్కాన్ ఇండియా ట్రైనింగ్ సెంటర్, ప్రభుత్వ నర్సింగ్ ట్రైనింగ్ కాలేజీలో డ్రగ్స్ వాడకం, మహిళలపై అన్యాయాలు, నివారణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ డ్రగ్స్ అనేది మన సమాజానికి, యువతకు ఒక పెద్ద ముప్పు అన్నారు. యువత మెజారిటీ భాగం కళాశాల విద్యార్థులు కావడంతో, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. డ్రగ్స్ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమైనది మాత్రమే కాకుండా వ్యక్తిగత జీవితం, కుటుంబ జీవితం, చదువు, ఉద్యోగం సమాజం పైన ప్రభావం చూపుతుందన్నారు. ఇది మీ జీవితంలో పెద్ద నష్టాన్ని కలిగిస్తుందని, డ్రగ్స్ తీసుకున్న క్రమంలో చాలామంది నేరాలకి పాల్పడుతున్నారని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగి, ఒక మంచి భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కి దూరంగా ఉండండి, ఆరోగ్యంగా సంతోషంగా జీవించాలని సూచించారు. అలాగే మహిళా విద్యార్థులకు చట్టాల గురించి తెలియజేయడం, వారి హక్కులను రక్షించుకోవడం, సమాజంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలను తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్కరు చట్టాల గురించి తెలుసుకోవాలని అన్నారు. మహిళల రక్షణ కోసం చట్టాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని సమర్ధవంతంగా ఉపయోగించడానికి ప్రతి ఒక్కరూ ఆచరణలోకి తీసుకురావాలని ప్రతిజ్ఞ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు


యాదమరి పిహెచ్‌సిని పరిశీలించిన కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: యాదమరిలో నూతనంగా నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రంను త్వరితగతన పూర్తిచేసి 10 రోజులలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ యాదమరిలో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించిన అనంతరం చిత్తూరు- గుడియాత్తం రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రంను పూర్తి చేయాలని, ప్రస్తుతం ప్లంబింగ్ వర్క్ జరుగుతున్నందున సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతతో పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్మించిన అన్ని గదులను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌కు పూర్తిగా టైల్స్ వేయాలని ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు విధులు నిర్వహించే సిబ్బందికి, డాక్టర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పిహెచ్‌సికి రోజుకు 100 ఓపి కలదని, 24 గంటలు స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉంటారని, ఒక డాక్టర్ ఉన్నారని, మందులకు ఎటువంటి కొరత లేదని అదనపు డీఎం అండ్ హెచ్‌ఓ వెంకటప్రసాద్, మెడికల్ ఆఫీసర్ సురేఖ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం డ్యామేజ్ అయిన చిత్తూరు- గుడియాత్తం రోడ్డు పరిశీలించారు. ఈ రోడ్డును మరమ్మతులు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆర్ అండ్‌బి ఎస్‌ఈ ఉమామహేశ్వర్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌అండ్ బి ఈఈ స్టాండ్లీ జోన్స్, డిప్యూటీ ఈఈ గోవర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

వీవోఏల పై రాజకీయ వేధింపులు మానుకోవాలి

యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు



ప్రజాశక్తి- వెదురుకుప్పం/ కార్వేటినగరం: జిల్లాలో వీవోఏలను రాజకీయ వేధింపులతో తొలగించే ప్రయత్నం వెంటనే మానుకోవాలని ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం కార్వేటినగరం ధర్మరాజు గుడిలో జరిగిన సమావేశంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జీను రాజశేఖర్, శ్రీధర్ బాబు, గంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే ప్రస్తుత ప్రభుత్వం చేయడం దారుణమన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వీఓఏలను అకారణంగా తొలగించే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వాలు మారినప్పుడల్లా బెదిరించడం ఏమిటి అని ప్రశ్నించారు. ప్రస్తుతమున్న వీవోఏలను యధాతధంగా కొనసాగించాలని తొలగించే ప్రయత్నాలు చేస్తే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం విఓఏ లకు కనీస వేతనం అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఈఎస్ఐ పిఎఫ్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కిందిస్థాయి తెలుగుదేశం నాయకులు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా మా ప్రభుత్వం అధికారంలో ఉంది కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వాన్ని పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. జిల్లాలో సదుం, సోమల, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, కార్వేటినగరం, పాలసముద్రం, ఎస్‌ఆర్ పురం మండలాలలో రాజకీయంగా తొలగించే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు తులసి, విఓఏలు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

సూపర్ సిక్స్ పైనే ఆశలు

వచ్చే ఏడాదికి తల్లికి వందనం వాయిదా

ప్రజాదృష్టి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్:

ఎన్నికల ప్రచారంలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఎన్టీఆర్ భరోసా నెలకు 4000 పింఛన్, 45 ఏళ్లు దాటిన మహిళలకు 18,000 వంటి సూపర్ సిక్స్ పథకాలతో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసిపి 11 మినహా మిగిలిన అన్ని స్థానాల్లో తెలుగుదేశం కూటమి పార్టీలు ఘన విజయం సాధించాయి. ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సంతకం పింఛన్ల పెంపు, సమగ్ర భూహక్కు చట్టం రద్దు, మెగా డీఎస్సీ పై సంతకం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను త్వరలో అమలు చేస్తామని ప్రకటించారు. ప్రతి ఏడాది జూన్ మాసంలో గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రూ.15 వేలు విద్యార్థి చదువు కోసం ఆర్థిక సాయం అందించింది. అమ్మఒడి స్థానంలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంతమంది పిల్లలు ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో వారందరికీ ఏడాదికి 15,000 రూపాయలు ఆర్థికస్థాయం అందిస్తామని ప్రకటించింది. ఏడాది జూన్ మాసంలో ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం తల్లికి వందనం అమలు కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య సర్వే పేరుతో కాలయాపన చేసిన శాసనమండలి సాక్షిగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఏడాది తల్లికి వందనం అమలు చేసే పరిస్థితి లేదని తేల్చేయడంతో తల్లికి వందనం వచ్చేయడానికి వాయిదా పడింది.

ఇసుక సరఫరాలో నూతన విధానాన్ని తీసుకొచ్చినప్పటికీ ఈ పథకం ఇప్పటివరకు గాడిలో పడనట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నారు. ఉచిత ఇసుక మైనింగ్ తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం నుండి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో లైసెన్సుల జారీ ఆలస్యం అవుతోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం ఇప్పట్లో అమలయ్యే పరిస్థితి లేనట్లు తెలుస్తోంది. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటినుండి రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తూ వుందా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నారా భువనేశ్వరీ పర్యటన విజయవంతం

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటన విజయవంతం కావడానికి సహకరించిన ఎన్డీఏ కూటమి నాయకులకు, నియోజకవర్గ ప్రజలకు తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పత్రికాముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆమె ఇచ్చిన హామీ మేరకు కుప్పం నియోజకవర్గంలో 4 రోజుల పాటు పర్యటించారని, రెండు గ్రామాలను దత్తత తీసుకున్నట్టు తెలిపారు. కుప్పం ప్రజలతో మమేకమై వారి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారని, ఎన్నికల ముందు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మొబైల్ క్లినిక్, సంజీవిని క్లినిక్ ప్రారంభించి దిగ్విజయంగా కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొదటి విడతలో భాగంగా చిరు వ్యాపారస్తులకు తోపుడు బండ్లను అందించడం ఆనందంగా ఉందన్నారు. 30 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేసామన్నారు. కుప్పం నియోజకవర్గంలో డీఎస్సీ కోచింగ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పేదరికం లేని కుప్పం కార్యక్రమంలో తాను భాగస్వామ్యం అవుతానని భువనేశ్వరి ముందుకు వచ్చి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారని ఆయన తెలిపారు.

'పెద్దిరెడ్డి సవాల్ కాసుకో..'

భూములు, గనులు, ఇసుక, విద్యుత్తు అన్నింటా దోపిడీలు : రామచంద్ర యాదవ్

ప్రజాశక్తి- పుంగనూరు



గత అయిదేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ భూములను తమ సొంత ఆస్తులలాగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అతని కుటుంబ సభ్యులు, వైసీపీ నేతలు పంచుకుని తిన్నారని బీసీ యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు.. శనివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి, అతని మనుషులు కేవలం భూములను మాత్రమే కాకుండా గనులు, ఇసుక, విద్యుత్తు అన్నింటా దోచుకున్నారని అధినేత మండిపడ్డారు.. పెద్దిరెడ్డి కంపెనీ పీఎల్‌ఆర్‌కి లబ్ధి చేకూర్చడానికి అక్రమ ప్రాజెక్టులు కట్టబెట్టారని.. రైతుల భూములు దోచుకున్నారని ఆరోపించారు.. రాష్ట్రంలోని సామాన్య ప్రజల నుండి ప్రతీ ఒక్కరూ గత అయిదేళ్ల దోపిడీ, అరాచకాలపై ఆశ్చర్యపోతున్నారనీ పేర్కొన్నారు. రాష్ట్రంలోను, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోను జరిగిన అక్రమాలు కళ్లెదురుగా కనిపిస్తున్నా.. ఎంపీ మిథున్ రెడ్డి ప్రస్తావించిన అఫిడవిట్ అంశంపై కాకుండా మీరు ప్రకటించని, చూపని ఆస్తుల గురించి మాట్లాడాలని సవాల్ చేశారు.. "మీరు దోపిడీ చేసిన, దౌర్జన్యంగా లాక్కున్న ఆస్తుల గురించి, మీ తండ్రి గారి ఎన్నికల అఫిడవిట్‌లో చూపించని ఆస్తులు 142 నేను సేకరించి కోర్టుకి ఇచ్చానని.. మీ దోపిడీలో ఇవి కేవలం 1% మాత్రమే.. మీరు పొందుపరచనీ ఆస్తుల వివరాలపై విచారణ జరుగుతుందని చెప్పారు.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అతని కుటుంబ సభ్యులు, అనుచరుల ఆగడాలు, అక్రమాలను బయటపెట్టి తీరుతానని.. పుంగనూరు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పెద్దిరెడ్డి అరాచకాలకు శాశ్వత విముక్తి కోసం తాను పోరాటం చేస్తూనే ఉంటానని రామచంద్ర యాదవ్ స్పష్టం చేశారు. ఈ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

ప్రతి మూడు నెలలకు మెడికల్ క్యాంప్ : కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా డిఎం అండ్ హెచ్ఓ, డిసిహెచ్ఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో సఫాయి కర్మచారి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన భూమిక పోషిస్తారని, వీరికి పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించడంలో మున్సిపల్ కమిషనర్లు, శ్యానిటరీ ఇన్స్పెక్టర్లు బాధ్యతగా ఉండాలని అన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా డిఎం అండ్ హెచ్ఓ, డిసిహెచ్ఎస్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలో నిపుణులైన వైద్యబృందాల ద్వారా ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి కార్మికులకు షుగర్, బిపి, రక్త పరీక్షలు, డెంగీ, కంటి పరీక్షలు వంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. మద్యానికి బానిసలుగా ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని సచివాలయ పరిధిలో శానిటరీ ఇన్స్పెక్టర్ ద్వారా పారిశుద్ధ్య కార్మికులచే ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, పిఎం జీవన జ్యోతి యువజన పథకాల కింద నమోదు చేయాలని, ప్రమాద సమయాలలో ఈ స్కీమ్ లు కార్మికులకు ఆసరాగా ఉంటుందన్నారు. ప్రమాద, అనారోగ్య సమయాలలో కార్మికులకు సంబంధించి బీమా మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఇప్పించే బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్మికుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి శానిటరీ ఇన్స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమించి ప్రైవేట్ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసదుపాయాలకు సంబంధించి సమాచారం సేకరించాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి ఈపిఎఫ్ ఖాతాల వివరాలను సమీకరించాలని పిడి మెప్మాను ఆదేశించారు. చీలాపల్లి సిఎంసి, అపోలో, కుప్పం పిఈఎస్, తిరుపతిలోని స్విమ్స్, రుయా, ప్రైవేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ కింద, ఆరోగ్యశ్రీ లేని వారికి ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్మికులకు అవసరమైన యూనిఫారంలు, గ్లౌజులు, షూలు అందించాలని ఆదేశించారు. కార్మికులు మరణిస్తే వారి పిల్లలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు విధి నిర్వహణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలలో భాగంగా భద్రతా సామగ్రిని అందించడం జరుగుతున్నదని, విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో ప్రథమ చికిత్స కిట్ల ఏర్పాటు, తరచూ మెడికల్ క్యాంప్‌లు నిర్వహించడం జరుగుతున్నదని, ఆయుష్మాన్ భరత్ కింద నమోదు, ఉన్నత జీవన ప్రమాణాల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను అందిస్తున్నామని తెలిపారు. సఫాయి కర్మచారి చిత్తూరు సభ్యులు చిన్నస్వామి, వరలక్ష్మి మాట్లాడుతూ సఫాయి కర్మచారి కార్మికుల పిల్లల చదువులకు అవసరమైన స్కాలర్షిప్‌లు, ప్రైవేట్ ఎయిడెడ్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ప్రభుత్వ నిబంధనల మేరకు 25 శాతం రాయితీ అందేలా చూడాలని, కార్మికుల పిల్లల్లో చాలా మంది ఉన్నత విద్యావంతులు ఉన్నారని, వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, అందుకు అవసరమైన బ్యాంక్ రుణాలు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. పంచాయతీల పరిధిలో ప్రతి నెలా జీతభత్యాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, ఏఎస్పి ఆరిఫుల్లా, హౌసింగ్ పిడి పద్మనాభం, ఆర్ డబ్ల్యుఎస్ఎస్ ఈ విజయ కుమార్, డిపిఓ లక్ష్మి, డిసిసిబి సిఈఓ మనోహర్ గౌడ్, చిత్తూరు, పుంగనూరు, పలమనేరు, మున్సిపల్ కమిషనర్‌లు అరుణ, నరసింహ ప్రసాద్, రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

వ్యవసాయ అధికారి చరిత

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదయకమని వ్యవసాయ అధికారి చరిత అన్నారు. యాదమరి మండలంలోని పెరుమాళ్ళపెంట గ్రామంలో వేరుశెనగ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిమాట్లాడుతూ ప్రతి రైతు మేలైన పంట యాజమాన్య పద్ధతులు అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను పొందుటకు అవకాశం ఉందని తెలిపారు. రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటలను పండించాలని, అవసరం మేరకు కషాయాలు వాడాలని సూచించారు. అన్ని పంటలకు ఘన, ద్రవ జీవామృతాలు తయారు చేసుకోవాలని తెలియజేశారు. ఏపీసీఎన్ఎఫ్ పార్వతి బీజామృతం, నీమాస్త్రం తయారుచేసే విధానం డెమో చేసి చూపించారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీగజాతి పంటలను పండించండి

ఉద్యానవన శాఖాధికారి సాగరిక

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తీగజాతి పంటలను పండించాలని ఉద్యానవన శాఖాధికారి సాగరిక సూచించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రెస్లిన్ ఉద్యానశాఖ ద్వారా తీగజాతి కూరగాయలైన కాకర, బీర, టమోటా పంటలను పందిళ్ళు విధానంలో సాగు చేసేందుకు కట్టెలు, దారాలతో సాగుచేసే రైతుకు ఎకరాకు రూ.7500లకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. రెండో రకం మల్లింగ్స్ కూరగాయ మార్చే విధానంలో ప్లాస్టిక్ కవరు భూమి పైన పరిచి సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.6400లు ఉద్యాన శాఖ రాయితీ ఇవ్వడం జరుగుతుందని కావలసిన రైతులు రైతు సేవా కేంద్రంలో పొలం పాస్ బుక్, ఆధార్ కార్డు బ్యాంక్ ఖాతా బుక్ అందించి పొలం ఫోటోతో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయండి

సహాయ వ్యవసాయ సంచాలకులు నాగ పద్మిని

ప్రజాశక్తి -సదుం: వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు వ్యవసాయం చేయాలని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. శనివారం సదుం బూరగమంద గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రంలో రైతులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామాలలో అందుబాటులో ఉన్న చెట్ల ఆకులు, ఆవు పేడ ఎరువులుగా వేసి పంటలు పండించాలన్నారు. రైతులు తమ భూములలో భూసార పరీక్షలు చేసుకొని భూములలో పోషకాల లభ్యతను బట్టి జీవ ఆధారిత ఎరువులు వాడాలని సూచించారు. వ్యవసాయ అధికారులు ఏఓ హరిప్రసాద్, సిబ్బంది లలిత, అఖిల్, మనీషా, చాందిని, రైతులు పాల్గొన్నారు.

81 చిన్న ఉప్పరపల్లిలో పొలం బడి

ప్రజాశక్తి- సోమల: మండల వ్యవసాయ అధికారి సుధాకర్, సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ ఆధ్వర్యంలో, 81 చిన్న ఉప్పరపల్లి రైతు సేవా కేంద్రం పరిధిలోని గాంధీనగర్ గ్రామంలోని వెంకటస్వామి అనే రైతు వేరుశెనగ పంట పొలంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులతో పాటూ లాభాలను సాధించవచ్చని సూచించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించాలని చెప్పారు.

'నీటి సంరక్షణలో భాగస్వాములుకండి'

ప్రజాశక్తి- కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం జల్ శక్తి అభియాన్‌లో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, సాంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, పౌరుదుల సామర్థ్యం వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి మాట్లాడుతూ నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడం అవసరమని తెలియజేశారు. నీటి సంరక్షణ చర్యల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి చుక్క ఒడిసి పడితేనే భవితకు నీటి భరోసా 'క్యాచ్ ది రైన్' నీటి సంరక్షణ చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సిఎన్ లత, డాక్టర్ హరిబాబు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి- పుంగనూరు: శుభరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో జరిగే అభివృద్ధి పనులపై చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. కళాశాలకు అవసరమైన మౌలిక వసతులపై సిపిడిసి కమిటీ చర్చించి శనివారం నిర్ణయం తీసుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ కళాశాలకు అవసరమైన ప్రహరీ గోడ, తరగతి గదులు, ప్రిన్సిపల్ కార్యాలయం వరకు సిసి రోడ్ నిర్మాణం, సైకిల్ స్టాండ్ పునర్నిర్మానం, కళాశాలలో క్యాంటీన్ నిర్వహణ, కళాశాలలోని పండ్ల తోటకు చుట్టూ ముండ్ల కంచె ఏర్పాటు, శుభారం స్థలదాత విగ్రహ ఆవిష్కరణ కోసం చేయవలసిన పనులపైన చర్చించి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సభ్యులు భక్తవత్సల రాజు, విశ్రాంత అధ్యాపకుడు రెడ్డిపరెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరన్ కుమార్, రమేష్ బాబు, సురేష్ కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని బగలనత్తం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి నేతలతో కలిసి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. నేతలు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో అన్ని విధాల విద్యా సామాగ్రి, మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించి మరింత అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. క్లస్టర్ ఇంచార్జ్ మునిరెడ్డి, పంచాయతీ అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ రెడ్డి, జయరాం రెడ్డి, మంజునాథ నాయుడు, రాఘవేంద్ర, హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్: మండలంలోని గరిగచినేపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉత్తమ విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలలో అధిరోహించాలని సూచించారు.

దోమల నివారణకు ఫాగింగ్

ప్రజాశక్తి- పెద్దపంజాణి: గ్రామాల్లో ప్రజలు జ్వరాల భారిన పడకుండా ఉండాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్త అవసరమని దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నట్లు సర్పంచ్ రమేష్ బాబు తెలిపారు. శనివారం కోగిలేరు గ్రామపంచాయతీలో దోమల నివారణకు పాగింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలోని బసవరాజుకండ్రిగలో భావన (11) అనే బాలిక ఇటీవల డెంగీ జ్వరంతో తిరుపతి రుయాకు వెళ్ళి వైద్యం చేసుకుందని, ప్రస్తుతం ఆ బాలిక ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిందని ఆరోగ్యంగానే ఉందన్నారు. ఈనేపథ్యంలో గ్రామ పంచాయతీలోని కోగిలేరు, పొట్టగానిపల్లి, చీకలదిన్నేపల్లిలో కూడా ముందస్తు పారిశుధ్య చర్యల్లో భాగంగా మురుగునీటి కాలువలు శుభ్రం చేయించి ఇటీవల మలాథిన్ మందును ట్రాక్టర్ల ద్వారా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పిచికారి చేయించారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం గ్రామ పంచాయతీలోని కెంపసముద్రం గ్రామంలో టిడిపి కార్యకర్త వెంకటేష్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. టిడిపి నేతలు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.10వేలను అందజేశారు. మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, గంట్లరెడ్డి, కోదండరెడ్డి వెంకటరమణ, విజయ్ కుమార్ రెడ్డి, అవినాష్, ఆదిల్, సురేష్, మునిరత్నం పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



ప్రజాశక్తి- పుంగనూరు: అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ దేశానికి సేవ చేయాలని ట్రస్ట్ చైర్మన్ అయూబ్ ఖాన్ అన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతి ఎంసివి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ సభ్యులు, నాగరాజా, తలారి శ్రీనివాసులు, రాజీ, నరసింహులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: శాస్త్ర, సాంకేతిక రంగం, క్షిపణిరంగంలో మాజీ రాష్ట్రపతిగా డాక్టర్ అబ్దుల్ కలాం అందించిన విశిష్ట సేవలు మరువలేనివని సోక్రటీస్ స్కూల్ కరస్పాండెంట్ గుణశేఖర్ అన్నారు. శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకల స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా అంజలి ఘటించారు. కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు మాట్లాడుతూ మిస్సైల్ మెన్ గా పేరు తెచ్చుకున్నటువంటి అబ్దుల్ కలాం జీవితం చాలా ఆదర్శమని అన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు





ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని హెచ్ఎం లలిత అన్నారు. శనివారం సప్తాహ్ కార్యక్రమంలో భాగంలో కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ అవరణంలో మొక్కలను ఉపాధ్యాయులు, విద్యార్థులు నాటడం జరిగింది. హెచ్ఎం లలిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పుట్టినరోజు సందర్భంగా ఓ మొక్కను నాటడం నేర్చుకోవాలన్నారు. పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కనకాచారి, భాస్కర రెడ్డి, మధుసూధన్, మురళీధర్, మదన్ మోహన్, వాణి పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని మామడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 40 రకాల మొక్కలను పాఠశాల ఆవరణలో నాటినట్లు ప్రధానోపాధ్యాయులు జ్యోతి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయలు, విద్య కమిటీ మెంబర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదుం: పుంగనూరు అటవీశాఖ ఆధ్వర్యంలో సదుం మహాత్మా జ్యోతీ బాపూలే బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం 'ప్లాంట్ ఫర్ మదర్ ఎర్త్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖా అధికారులు విద్యార్థులకు మొక్కలు పైన, చెట్లు పైన అవగాహనా కల్పించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, అటవీశాఖ అధికారులు మహేష్, షాజహాన్, చిన్నయ్య, రమణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక, రసాయనశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి మాట్లాడుతూ అడవుల్ని నరకడం వలన కాలుష్య పెరిగి వాతారణం స్థితిగతులు మారుతున్నాయని అన్నారు. ప్రతి విద్యార్థి తన వంతుగా ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వి.బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ టి.హరిబాబు, ఎం.రాజశేఖర్, డాక్టర్ సి.యన్.లత, డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: పాఠశాలల్లో చదివే విద్యార్థులు పచ్చదనాన్ని పెంపొందించేందుకు పచ్చదనం పెంపొందిస్తే కాలుష్యం తగ్గి ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు విద్యార్థి దశ నుండే మొక్కలు నాటి అందరికీ ఆదర్శంగా నిలవాలని పెద్ద ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ అన్నారు. శనివారం ఈసిఓ క్లబ్, అటవీ శాఖ కమ్యూనిటీ మొబలైజర్స్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అటవీ శాఖ సిబ్బంది బాలసుబ్రమణ్యం శ్రీనివాసులు, కిరణ్ కుమార్, చంద్రబాబు వెంకటేష్, శీను, సిబ్బంది పాల్గొన్నారు.

తహాశీల్దార్‌కు ఘన వీడ్కోలు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బైరెడ్డిపల్లి మండల తహాశీల్దార్‌గా స్వర్ణలత బాధ్యతలు చేపట్టారు. శనివారం సాధారణ బదీల్లో భాగంగా బదిలీ అయిన ఆమెను వీఆర్ఓలు, వీఆర్ఏలు ఘనంగా సన్మానించారు. శాలువ కల్పి పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా వీడ్కోలు పలికారు.



డ్రైవర్ అజాగ్రత్తతో

ఐదు వాహనాలు ఢీ


ధ్వంసమైన కారు


బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: డ్రైవర్ అజాగ్రత్త వలన వెనుకవెనుక వస్తున్న ఐదు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలైన సంఘటన శనివారం బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ రోడ్‌లో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు - బెంగళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్లోని శ్రీని ఫుడ్ పరిశ్రమ సమీపంలో బెంగళూరు నుండి చిత్తూరుకి వెళ్తున్న కంటైనర్ లారీ ముందు వైపు వెళుతున్న కారును ఢీకొంది. అదే కంటైనర్ ముందు వైపు వెళుతున్న పెట్రోలియం ఖాళీ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఆ దాటికి డివైడర్ను దాటుకొని చిత్తూరు - పలమనేరు రోడ్డులోకి ట్యాంకర్ వెళ్లింది. అదే సమయంలో చిత్తూరు నుంచి పలమనేరు వైపుకు వెళుతున్న కారును, కారు పక్కనే వెళుతున్న మోటార్ సైకిల్‌ను ఢీకొంది. అలాగే ముందు ఉన్న టమోటా లోడ్‌తో వెళుత్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో టమోటాలన్నీ రోడ్డుపై పడిపోయాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న భార్యభర్తలు వారి కొడుకుకు, అలాగే మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి కంటైనర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

తహాశీల్దార్ నారాయణకు ఘనసన్మానం



ప్రజాశక్తి- సోమల: మండల తహాశీల్దార్ నారాయణ బదిలీపై వెళుతుండడంతో కార్యాలయ సిబ్బంది శనివారం ఆయనను ఘనంగా సన్మానించి శాలువతో సత్కరించారు. డిటి రామమూర్తి, ఆర్ఐ, వీఆర్వోలు, విఆర్ఏలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సుల్లో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు ఈనెల 31వ తేదీ చేపట్టనున్నట్లు ప్రిన్సిపల్ మహమ్మద్, అధ్యాపకులు శ్రీవిద్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-24 ప్రవేశ పరీక్ష రాసి అర్హత పొంది చేరనివారు, పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అవసరమైన సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని వివరించారు.

4న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గ పరిధిలో జరగబోవు తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని నాయకులు శరత్ కుమార్ కోరారు. శనివారం ఆయన కుప్పం పట్టణ పరిధిలోని టిడిపి కార్యాలయంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 4న కుప్పం డివిజన్ పరిధిలోని వైద్యసిబ్బందితో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని ఈ సమావేశానికి కంచర్ల శ్రీకాంత్ ను ఆహ్వానిస్తూ, సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండల పరిధిలోని గుడివంక గ్రామంలో 28, 29 తేదీల్లో రెండు రోజులలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. గుడుపల్లి మండలంలో వెలసిన శ్రీ వల్లి దేవ సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ ప్రాంగణంలో రెండు రోజులపాటు బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి సీనియర్ నాయకులు మృతి

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్



ఉమ్మడి చిత్తూరు జిల్లా టిడిపి మాజీ అధ్యక్షుడు, ఎస్వి సుగర్స్ చైర్మన్, నగరి నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న ఆయన శనివారం రాత్రి తుది శ్వాస వదిలారు. టిడిపి పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ పునరుత్తేజానికి ఆవిరాళంగా కృషిచేసిన ఆయన చనిపోవడం ఆ పార్టీకి తీరని లోటు అని పలువురు ఆవేదన వ్యక్తుల పరుస్తున్నారు. అటు ఎన్టీ రామారావుకి ప్రియ శిష్యుడుగా, చంద్రబాబు నాయుడుకి సమకాలికుడిగా అత్యంత ఆప్తుడుగా ఉండి ఉమ్మడి జిల్లా రాజకీయాలను తనదైన శైలిలో చక్రం తిప్పిన ఘనత ఆయనకే దక్కింది.

వైభవంగా ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి- కార్వేటినగరం: స్కంధపుష్కరిణీ సమీపంలోని కుమారగిరిపై వెలసి ఉన్న వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ద్వజారోహణం కార్యక్రమంతో శనివారం అంగరంగవైభవంగా ప్రారంభమైయింది. వేకువ జామున స్వామివారని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అవరణంలో ఉన్న ధ్వజస్తంభాన్నికి ప్రత్యేక పూజలు చేపట్టి వేద పండితులు వేద మంత్రాల నడుమ ఆడికృత్తిక ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ద్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంకురార్పణ, గణపతి హోమం, భరణి అభిషేకం, దూపదీప నైవేద్యాలు చేపట్టారు. అనంతరం వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వార్లను పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ధర్శన భాగ్యం కల్పించారు. వైఎస్సార్సీపీ ఎంపీపీ లతబాలాజీ దంపతులు ఉదయదారులుగా వ్యవహరించారు. ఎండోమెంట్ ఈవా కృష్ణనాయక్. మాజీ ఆలయ చైర్మన్ రవియాదవు, డాక్టర్ దీపక్ రెడ్డి పళణిరెడ్డి సాయి అర్చకులు హరి పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని వింజం పంచాయతీ సిద్దేశ్వరకొండ గ్రామంలో శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో 29వ తేదీ ఆడికృత్తిక మహోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త ఏ. నరసింహారెడ్డి తెలిపారు. నేడు భరణి మహాభిషేకం భరణికావడిలు చెల్లింపు, 29వ తేదీ సోమవారం ఆడికృత్తిక కావడి చెల్లింపులు అభిషేకం అలంకరణ ఉంటుందన్నారు. 100 గొల్లపల్లి జైన్‌ఫామ్ ఫ్రెష్ ఫ్యాక్టరీ, చిత్తూరు నగరానికి చెందిన రామదాసు దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందని తెలిపారు.

రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించండి..

సరసభ్య సమావేశంలో సర్పంచులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో శనివారం సరసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ బండి నాగరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరై ప్రధానమైన సమస్యలపై చర్చించారు. పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాలంచెల్లిన మాత్రలను పంపిణీ చేశారన్న విషయాన్ని వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యురాలు ఎన్.రాధిక పురంధర్ రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇలాంటి సంఘటన మరలా తలెత్తకుండా చూస్తానని డాక్టర్ ప్రవీణ హామీ ఇచ్చారు. అలాగే వెదురుకుప్పం వారపు సంత, వాణిజ్య సముదాయం వేలంపాట వాయిదా విషయమై వెదురుకుప్పం సర్పంచ్ శిల్ప సభలో మాట్లాడారు. చట్టాల పట్ల సభ్యులు అవగాహన పెంపొందించుకోవాలని తహసీల్దార్ జయంత్ కుమార్ తెలిపారు. బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య రోడ్లు మంచినీటి సమస్యలపై మాట్లాడారు. నల్లవెంగనపల్లె జేఎల్ఎం పనితీరుపై అక్కడి సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీడీవోల పరిధిలోనే సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని ఎంపీడీవో వరప్రసాద్ సూచించారు. పనిచేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేఎల్ఎంలపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తే ఉద్యోగం నుంచే తొలగిస్తారని స్పష్టం చేశారు. చిత్తూరు రెండవ డిపో బస్సు సర్వీసులను చిత్తూరు వెదురు కుప్పం మీదుగా పునరుద్ధరించాలని కో-ఆప్షన్ మెంబరు వెంకటేశులు డిమాండ్ చేశారు. పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ తోకల మురళీరెడ్డి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎగువ కన్నికాపురం భూ సమస్యలు, ఆ గ్రామంలో రోడ్లు, నెట్వర్క్ సమస్యలపై గంటావారిపల్లె సర్పంచ్ శ్రీనాథరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. వెదురుకుప్పం వారపు సంత, వాణిజ్య సముదాయం వేలంపాట పై ఫిర్యాదులు అందాయని అందుకే తాత్కాలిక వాయిదా పడిందని ఈవోపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసుకోవాలని ఎంపీపీ నాగరాణి పిలుపునిచ్చారు.